# ఆశానిరాశలు

సుకాంత్ దత్తా తలిదండ్రులు చిన్నతనంలోనే చనిపోయారు. మేనమామ చేరదీసి చదువు చెప్పించడంతో సుకాంత్ పి. హెచ్‌డి. డిగ్రీని పొంద గలిగాడు. సింద్రీ ఫ్యాక్టరీలో గడచిన రెండు సంవత్సరాల నుంచీ పని చేస్తుండడంతో అతని జీవితం హాయిగా సాగిపోతోంది.

ఒకనాటి ఉదయం సుకాంతుకు మేనమామ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది.

ఆ ఉత్తరంలో :

''సుకాంత్,

నేను నీ వివాహం నిశ్చయించాను. అమ్మాయి పేరు సునంద. విజయలక్ష్మి నూలు ఫ్యాక్టరీ ప్రొప్రయిటర్ శ్రీ విజయఘోష్ గారి పెద్ద మ్మాయి. వాళ్లు మన యింటికి దగ్గరగానే శంకరీవడాలో ఉంటున్నారు. సునంద బి. ఎస్‌సి., పాస్ కాలేకపోయింది. చాల తెలివైంది. చురుకైంది. అందచందాల్లో నీ అభిరుచులకి సరైంది. పేరు ప్రఖ్యాతులున్న గౌరవమైన కుటుంబం ఈనాటి యువలోక మంతా వారివారి జీవిత సహచరులను వారు ఎన్నుకుంటుంటే నవనాగరికుడవైనా నువ్వు ఆ బాధ్యతను నా మీదనే పెట్టావు. సునందను కాదనలేవని నా నమ్మకం. ఆమె ఫొటోను యిందుతో పంపుతున్నాను. సుముహూర్తం ఫాల్గుణ శుద్ధ యేకాదశి. వ్యవధి చాల తక్కువ. శలవుకోసం యిప్పటి నుంచే ప్రయత్నించు. కనీసం పెళ్లికి రెండురోజులైనా ముందుగా యిక్కడుండాలి.''

సుకాంత్ ఉత్తరాన్ని జాగ్రత్తగా చదివి సునంద ఫొటోను పరిశీలనగా చూచాడు. కొద్దిసేపు ఏదో ఆలోచించాడు. టేబుల్‌మీదున్న కాగితంమీద మూడు నాలుగు రంగులు కుంచెతో వేసి తన శరీరచ్ఛాయకు సరిపోయిందేమో చూచుకున్నాడు.

కొంచెం ఆలోచించి ఉత్తరం వ్రాయడం ప్రారంభించాడు.

''శ్రీమతి సునందాఘోష్ : నాతో మీకు వివాహం నిశ్చయమైందని మీకు తెలుసునను కుంటాను. మీరు చాల అందమైనవారనీ, చురుకైన వారనీ, తెలివైన వారనీ మా మామయ్య తెలియజేశారు. మీ అందచందాలకు నాబోటి నీగ్రో తగినవాడు కాడేమోనని నా అనుమానం. బహుశః నేను చామన చాయగా ఉంటానని మీకు తెలిసిఉంటే మీరు మోసపోయి ఉండవచ్చు. నా నిజస్వరూపాన్ని మీకు తెలియజేయవలసిన బాధ్యత నాపై ఉంది. అందువల్ల నా శరీరచ్ఛాయతో సమానమైన రంగులను యీ కాగితంపై వేసి పంపుతున్నాను. మీకు అంగీకారమైతే యీ జాబు అందిన అయిదు రోజుల్లో మీ యిష్టాయిష్టాల్ని తెలియజేయండి. నా ఎడ్రసుతో నున్న కవరు కూడ పంపుతున్నాను. —సుకాంత్.

★

నాలుగు రోజుల్లో జవాబు వచ్చింది.

''డాక్టర్ సుకాంత్ దత్తా : మీతో వివాహానికి నాకేం అభ్యంతరంలేదు. పాపం. మీకు నిజం తెలియ

> బెంగాలీ మూలం :
> **'పరశురామ్'**
> ★
> అనువాదం :
> **శ్రీ శేషు**

నందుకు విచారిస్తున్నాను. నేను మీకంటే నల్లగా ఉంటాను. మీ మామగారు పెళ్లిచూపులకు వచ్చినప్పుడు నాకు రంగుపూసి చూపించడంతో వారు మీకు అలా తెలియజేసి ఉంటారు. నా దగ్గర రంగులు లేవు. బ్లూబ్లాక్ సిరా కొంత మీ రంగుల కాగితంపై పోశాను. అది కొంచెం యించుమించుగా నా శరీరచ్ఛాయకు దగ్గరగా ఉంటుంది. ఆ కాగితాన్ని మీకు పంపుతున్నాను.

''మగవాడు కురూపైనా తన భార్యగా ఊర్వశే కావాలంటాడు. మీ నిజాయితీకి నా ధన్యవాదాలు. మీకు ఏమాత్రం యిష్టం లేకపోయినా వివాహం మానుకోవడానికి సందేహించకండి. ఉత్తరానికి జవాబు మాత్రం రెండు రోజుల్లో వ్రాయండి.

— సునంద.''

★

సుకాంత్ దగ్గర నుంచి ఉత్తరం తిరుగు టపాలోనే వచ్చింది.

''మీరు నాకంటే కొంచెం నల్లగా ఉన్నా నాకభ్యంతరం లేదు. భార్యా రూపవతీ శత్రు: అనే సిద్ధాంతాన్ననుసరించే మీరు సౌందర్యవతిగా ఉండకపోవడాన్నే నేను కోరుతున్నాను. భార్య సౌందర్యవతి దొరకడానికి భర్త ఎంతో పూర్వజన్మ సుకృతం చేసి ఉండాలి. అలాంటి భార్యవల్ల ఆతనికి సంఘంలో పలుకుబడీ, గౌరవం పెరుగుతుంది. నేనూ మొదట కొంత స్వార్థంతో దీన్ని ఆశించాను. కాని మీ ముఖంలో ఉండే వర్చస్సు నన్ను ముగ్ధుణ్ణి చేసింది. నాలో స్వార్థమటు మాయమైంది.

''నాకు రోజుకు కనీసం పది, పదిహేను సిగరెట్లు కాల్చడం దురభ్యాసం ఉంది. మా వదిన 'సిగరెట్లు కాల్చేవాళ్ల నోరు చెడు వాసన వేస్తుంది. మగవాళ్లకు దడిసి, అసహ్యించుకుంటున్నా వాళ్ల భార్యలు యేమీ అనకుండా భయపడి నోరు మూసుకొని పడి ఉంటారు' అంటుంది. కొంతమంది బెంగాలీ పిల్లలు కూడ సిగరెట్లు కాల్చడానికి అలవాటు పడివుంటారు. మీరు కూడ ఆ తరగతికి చెందిఉంటే ఫర్వాలేదు. కాని మీరు ఆ తరగతికి చెందిఉండరని నా నమ్మకం. నా యీ దురభ్యాసానికి మీ కేమైనా అభ్యంతరం ఉంటే నాతో మీ వివాహాన్ని రద్దు చేసుకోండి. ఇందుకు మీరు వెనుదీయకండి. దయచేసి జవాబు వెంటనే వ్రాయండి.

—సుకాంత్.''

★

నాలుగవ రోజున సునంద వ్రాసిన జవాబు చేరింది.

అందులో —

''మీ రెన్ని సిగరెట్లు కాల్చినా నా కేం అభ్యంతరం లేదు. కాని సిగరెట్లు కాల్చడంవల్ల కేన్సర్ వ్యాధి రావచ్చు ననుకుంటాను. పోనీ— మీరు హుక్కానెందుకు అలవాటు చేసుకోకూడదు.? రోజుకు యిరవై ముప్పై తమలపాకులు పుగాకుతో వేసుకునే నాకున్న చెడు అలవాటును గురించి మీకు కూడ తెలియజేయడం మంచిదేమో ! తమలపాకుతో పుగాకు నమిలేవారి పళ్లు యే స్థితిలో ఉంటాయో మీకు చెప్పనక్కరలేదు. అలాంటి వారి ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో అమోనియా వాసన వేస్తుంటుంది. మా తమ్ముడు లంబూ దీన్ని గురించి యెన్ని మాటలో అంటుంటాడు. నా యీ చెడు అలవాటుకు మీకేమైనా అభ్యంతరం ఉంటే నాతో మీ వివాహాన్ని మానుకుంటే నేనేం అనుకోను. —సునంద.''

★

సుకాంత్ వ్రాసిన జాబులో —

''మీరు సిగరెట్ వాసనను భరించగలిగితే మీ అమోనియా వాసనను భరించగలగడం నాకేం కష్టంకాదు. నేను ఫ్యాక్టరీలో పనిచేస్తున్నంతసేపూ దీన్ని భరిస్తూ అలవాటు పడిపోయాను. మీ సలహా ప్రకారం హుక్కాను అలవాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తాను.

''నేను మీ దగ్గర యే రహస్యాన్నీ దాచగలగలేకపోతున్నాను. సాధారణంగా స్త్రీలు తమకు కాబోయే భర్తలు పరస్త్రీ పరాన్ముఖులుగా ఉండా లనుకోవడం సహజం. కాని నా హృదయం అప్పుడే సురంగికి అంకితమైపోయింది. సురంగి లాలాతోప్ చంద్, డిప్యూటీ కమీషనరుగారి అమ్మాయి. ఆమెను నే నెంతగానో ప్రేమించాను. ఆమె తలిదండ్రులు కూడ అభ్యంతరము చెప్పలేదు. సురంగి కరుణించకపోవడంతో నా ప్రేమ విఫలమైపోయింది. మా కాపర్స్ డిపార్టుమెంటులో నాకంటె మూడింతలు జీతం తెచ్చుకుంటున్న

హనుమంతయ్యను పెళ్లి చేసుకుంది. హనుమంతయ్య యమధర్మరాజులా ఉంటాడు. ఇప్పటికీ సురంగి నుండి నా హృదయాన్ని మరల్చుకో లేకుండా ఉన్నాను. ఆమె ఫొటో యెప్పుడూ నా యెదురుగానే ఉంటుంది. మన వివాహం జరిగి పోయిన వెంటనే దాన్ని తీసేస్తాను.

"సురంగి వివాహం జరిగిన నాటినుంచీ నాకు కూడ జీవితపు బరువులు మోయడానికీ నాతో కష్ట సుఖాల్ని పంచుకోవడానికీ జీవితంలో ఒక భాగస్వామి అవసరంగా తోచింది. నా బాధ్యత లన్నిటినీ ఆమె హస్తగతం చేసి నేను బాధ్యతారహితంగా నా తీరిక సమయాల్ని యే సౌందర్యార్చనకో, యే చిత్రలేఖనానికో వినియోగించుకుంటూ జీవితాన్ని హాయిగా మలయమారుతంలా మార్చుకుందామని నా ఆశ. వివాహాలు దైవ నిర్ణయాలని తెలియక యువ్వనోద్రేకంలో కంటి ముందు కనిపించిన సురంగిని ప్రేమించినందు కిప్పు డెంతగానో పశ్చాత్తాప పడుతుంటాను. జీవిత సహ చర్యలలోనే అనురాగం అధికమౌతుంటుంది. సతీపతులు వారికి కలుగబోయే సంతతిని తల్చుకుంటూ వారు పరమానందాన్ని పొందుతారు. ఈ ఆనందానుభూతి ఎవరో నిర్ణయించి చేసిన వివాహితుల దాంపత్యంలోనూ, తమంత తాము వలచి చేసుకున్న వివాహితుల దాంపత్యంలోనూ సహజం. సమానం. ఇందువల్లే నా భార్యను నిర్ణయించే భారం మా మామయ్యపై వదిలాను.

"నేను జీవితంలో చేసిన పొరబాట్లూ నా జీవిత పరమావధులూ మీకు విస్పష్టంగా తెలియజేశాను. నాతో మీ వివాహాని కేమైనా అభ్యంతరం వుంటే తెలియజేయండి. —సుకాంత్."

★

సునంద నుంచి జవాబు వచ్చింది.

"మీ జీవిత పరమావధులతో నేను యేకీభవిస్తున్నాను. మీరు జీవితంలో చేసిన పొరబాట్లు యేమంత ప్రమాదమైనవిగా తోచవు. మీరు యే విషయాన్నీ మరుగు చేయకుండా బహిరంగ పరుస్తున్నందుకు నా ధన్యవాదాలు. నేను కూడ జీవితంలో ఒకసారి మోసపోయాను. పవన్‌కుమార్ పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సు చదువుతున్నప్పుడు అతన్ని ప్రేమించడం జరిగింది. వారు భాదూరి బ్రాహ్మణులు. శుద్ధ ఛాందసులైన ఆతని తలిదండ్రులు ఒప్పుకోని కారణంగాఅతనితో నావివాహం జరుగలేదు. అతడు బెంగుళూరులో యేదో గొప్ప ఉద్యోగమే చేస్తున్నాడు. ఇప్పటికీ నా మనస్సును పవన్‌కుమార్ నుండి మరల్చుకోలేక పోతున్నాను. మీ అంతటి ఉదార హృదయులు భర్తగా దొరికిన తర్వాత మర్చిపోగలనేమోనని ఆశ పడుతున్నాను.

"మీ సురంగి ప్రక్కగా నా పవన్‌కుమార్ ఫొటో నుంచుదాం. నా సూచనపై మీ అభిప్రాయం తెలియజేయండి. —సునంద."



ఉఖునుపోక... డ్రారర్న్యఢేఘ టిడీతక ; ంతుడ

సుకాంత్ వ్రాసిన జవాబులో :

"సునందా!

పేరుతో పిలుస్తున్నానని ఆశ్చర్యపోతున్నారా ? వద్దు — మనిద్దరి మధ్యా యే రహస్యాలూ లేవు. మన కలయికను యే బలవత్తర శక్తులూ అటంక పర్చలేవు. మన ఉత్తర ప్రత్యుత్తరాల్ని బట్టి మన దృక్పథాలు ఒకటేనని నేను నమ్ముతున్నాను. మా మేనమామ చెప్పినట్లు మీరు బి. ఎస్‌సి., తప్పినా చాల చురుకైనవారుగానూ, ఉత్సాహవంతులుగానూ కనిపిస్తున్నారు. మనబోటి రాజ జాతకులను భార్యాభర్తలుగా నిర్ణయించిన ఆ సృష్టికర్త యెంత ప్రతిభాశాలో! మన వివాహ సుముహూర్తం


కేశముల సౌందర్యాభి వృద్ధికి
కాష్మీర్-కుసుం
ఇష్టమైన వాసనలో నాణమైనది
సుగంధ చర్మరక్షణ మలాము
సాంటలక్స్
దురద, గజ్జలు, కాళ్లు, మొటిమలకు
కస్తూరి బత్తులు
ఫ్లవర్ దస్తు
పునుగు-అంబర్
సాంబార్ పే ఆఫుడర్
నంజనగూడు-పండ్లపొడి
తయారీదారు
యునైటెడ్ కన్‌సర్న్, మద్రాసు—1.
బ్రాంచీలు : హైద్రాబాద్, విజయవాడ.

**ఇంక ఒక** వారం మాత్రమే ఉంది. **ఈ రోజులు మీ ధ్యానంలోనే** గడుపుతూ ఆనందిస్తాను. మీ దర్శన **భాగ్యం దొరికేంత** వరకూ తొందరపడి మాత్రం **యేం ప్రయోజనం ? ఈ ఉత్తరాన్ని యింతటితో ముగిస్తాను. —మీ సుకాంత్."**

**కొద్ది** రోజులు గడిచాయి. సునంద జవాబు **వ్రాసింది.**

**అందులో** —

"మిమ్మల్ని నిరాశపాలు చేసినందుకు నన్ను **క్షమించమని** ప్రార్థిస్తున్నాను. పవన్‌కుమార్ యిప్పుడు పెద్ద సంపన్నుడైనాడట. అతని తలి దండ్రుల అంగీకారంతో అతనికి యిప్పుడు **నిమిత్తం** లేదట. నే నాతనితో వివాహం కాదంటే **ప్రాణత్యాగం** చేస్తాడట. నేను మనసారా ప్రేమిం **చిన** పవన్‌కుమార్ యింత ప్రాధేయపడడం' **ప్రాణత్యాగం** చేస్తాననడం నేను సహించలేక అత **నితో** రేపు అర్ధరాత్రి బెంగుళూర్ వెళ్లిపోతు న్నాను. పాపం — మీరు నా కలయిక కోసం ఎంత **కలవరిస్తున్నారో** ! నాపై యెన్ని ఆశలు పెట్టు **కున్నారో**! ఎన్ని ఆశా హర్మ్యాలు నిర్మించుకున్నారో! కాని — మనసుకు వచ్చిన మగవాణ్ణి కాదనలేని స్త్రీ దౌర్బల్యానికి లోనుగాకుండా ఉండలేక **పోయాను.** మిమ్మల్ని నమ్మించి మోసం చేయడం మనస్క రించక ఒక ఏర్పాటు మాత్రం చేస్తున్నాను. దీన్ని మన నిర్మల ప్రేమకు సాక్షిగా మీరు అంగీకరించవలసిం దని ప్రార్థిస్తున్నాను. నంద నా చెల్లెలు. మాకు ఒకే ఒక వసంతం తేడా. నాకంటె రూపవతి. ఎప్పుడూ పెదవులపై చిరునవ్వు చిందుతూ ఉంటుంది. ముత్యాలవంటి పలువరుస నాకుంటే తమలపాకుతో పుగాకు నమలే దురలవాటు లేదు. ఆమె కూడ బి. ఎస్‌సి., తప్పింది. నంద యింత వరకూ యెవరి వలలోనూ చిక్కుకోలేదు. మీ ఉత్తరాలన్నీ ఆమె చదివింది. మీరంటే ఎంతో మనసు పడుతోంది. మీతో వివాహానికి ఉవ్విళ్లూరు తోంది. దయచేసి దీన్ని రహస్యంగా ఉంచండి. అల్లరి చేయకండి. సుముహూర్తానికి చల్లగా వచ్చి నందను స్వీకరించి సుఖపడండి. మీ బ్రతుకు బరువులను మోయగల గృహిణి నంద. నందకు. సునందకు యేం వ్యత్యాసం లేదు. నామాట నమ్మండి. నంద నా సోదరి కావడంవల్ల ఆమె సుగుణాల్ని నేను శ్లాఘించడం పొగడ్తగా ఉంటుంది. అందువల్ల యింతకంటె యెక్కువ చెప్పదల్చుకో లేదు. నా కేమాత్రం అవకాశమున్నా మీ వివాహానికి వచ్చి స్వయంగా మీ క్షమాభిక్ష వేడుకుంటాను.

— సునంద.'

సుకాంత్ స్థబ్దుగా కూలబడిపోయాడు. **అతని** శరీరం చైతన్యరహితమైంది. అతని ఆశాజ్యోత్స్న కాల మేఘ కబళితమైంది. ఆ నిరాశాప్రత నిబిడాంధ కారంలో అతని బ్రతుకు బాట దుర్గమమైంది. శూన్యంలోకి చూస్తూ కొద్దికొద్దిగా కోలు కుంటూ అతని భవిష్యత్తును పదేపదే తరచడం మొదలుపెట్టాడు. ఆలోచించి చూడగా సునంద తనకు చేసిం దేమాత్రం ద్రోహంగా తోచలేదు. తనకు కావలసినది తన బ్రతుకు బరువును సహ నంతో భరించగల గృహిణి మాత్రం. ఆమె సునం దైనా, నందైనా ఒకటిగానే అతనికి తోచింది. సునంద సలహాను పాటించడంలో తనకు కలిగే ప్రమాదం యేం లేదనే నిశ్చయానికి వచ్చాడు. తన మేనమామ యెవరిని నిర్ణయిస్తే ఆమెను స్వీక రించడానికి సంసిద్ధు డయ్యాడు.

★

సుకాంత్ సుముహూర్త సమయానికి అత్తవా రింటికి బంధు వర్గంతో చేరుకున్నాడు. సునంద ప్రసక్తి గాని యే విధమైన కలవరంగాని కనుపిం చక పోవడంతో అతని కెంతో ఆశ్చర్యం కలిగింది. అచ్చట విడిది చేసిన పెళ్లివారికి తాంబూలాలూ, సిగరెట్లు యిస్తూ సత్కరిస్తున్న లంబూ అనే పదహారు సంవత్సరాల కుర్రవాణ్ణి దగ్గరకు పిలిచి—

"సునంద **మీ అక్కకదూ?"** అంటూ **రహస్యంగా** ప్రశ్నించాడు **సుకాంత్.**

**"అవునండి."**

**"విశేషాలేమిటి?"**

"ఏమున్నాయి. **అక్కయ్యను ముస్తాబు చేస్తు** న్నారు. కొంచెం చేపుంటే వచ్చేస్తుంది" **అన్నాడు** పరిహాసంగా.

"సునంద వెళ్ళిపోయిందా?"

"పెళ్ళికూతురు ఎక్కడికి **వెళ్ళిపోతుంది?"**

"నాకున్న దొక్కతే అక్క సునంద. ఆమెకు యిప్పుడు వివాహం."

**"ఓహో!"** అన్నాడు సుకాంత్ **నవ్వుతూ.**

★

అర్ధరాత్రి గడచింది. కడ కామెను **ఒక్కతెనూ** స్వర్గ సమంగా అలంకరించిన ఆ గదిలో వదలి ఎవరి దారిని వారు వెళ్ళిపోయారు.

"నందా?—సునందా?" అని సుకాంత్ **ప్రశ్నిం** చాడు.

ఆమె జడలో విచ్చిన సన్నజాజులు **సుకాంత్‌ను** మత్తులోనికి లాగుతున్నాయి.

ఆమె కంకణ నిక్వణంలో ఆమె కిలకిలా నవ్వింది కాబోలు ననిపించింది – సన్నజాజుల మధుర పరిమళాలలో మైమరిచిన సుకాంత్‌కు.

అతడు ఆ మగతతో, ఆ మత్తులో మైమరచి నిద్రపోతే ఆమెకు కలిగే నిస్పృహను జ్ఞప్తికి తెచ్చు కుని, ఎన్నెన్ని తేనె లూరించే వెన్నెల రాత్రులో **ఈ** మధుర సమాగమం కోసం వేచియున్న **ఈ** రేయి వృథా కారాదని సునంద చల్లిన పన్నీటి జల్లులతో మగతతో నుండి బరువెక్కిన కనురెప్ప **లతో** సుకాంత్ వాస్తవిక జగత్తులోనికి దిగివచ్చి' మొదటి ప్రశ్నే తిరిగి "నందా? సునందా." **అన్నాడు.**

'నా రిద్దరికీ ఎంతో వ్యత్యాసం లేదు. సామాన్య సమయాల్లో నేనే నంద. శుభ సమయాల్లో నేనే సునంద."

"ఇన్ని మోసా లెందుకు రాయడం?"

"నాకు కాబోయే జీవిత సహచరుని **మహ శీలాన్ని** నిర్ణయించుకునేందుకు."

"పవన్‌కుమార్ ఏమైనాడు?"

"సురంగి ఏమైంది?"

"తెలివైనవారు మీరైతే అతి **తెలివైనవారు** యింకొకరు."

"ఎంత తెలివుంటేనేం. **బి. యస్ సి. పోయాక."**

"మాక్స్ వెల్ థి యరీ తప్ప మరే దొచ్చినా **తప్పే** ఉండేదా న్నేమిటి."

"మాక్స్ వెల్ థియరీ కేముంది. యిలా చూడు. **అబ్బ!** యెంత అందమైన **కళ్లు!"**

"— — — —"

"ఉత్తరాలు నిజమని నమ్మితే ఈ సౌందర్య రాశిని ఎవరు దక్కించుకుని ఉందురో?"

"వివాహాలు దైవ నిర్ణ**యాలు. ఇందులో** మనం నిమిత్తమాత్రులం."

గదిలో ఎలెక్ట్రిక్ దీపం ఆరిపోయింది. ★



పెప్స్
లోక ప్రసిద్ధమైన
గొంతు
మరియు
గుండె
బిళ్లలను
రొమ్ము పడిశెము
త్వరితంగా నివారించ బడినది
గొంతు నొప్పి, రొమ్ము పడిశెము, దగ్గులు, ఆయాసము, గొంతు మరియు గుండె బిళ్లలైన పెప్స్‌తో త్వరితంగా నివారించబడును. ఒక పెప్స్‌ను చప్పరించి ... వ్యాధికారక క్రిము లను చంపి, నొప్పిని పోగొట్టుచర్యను జరిపే అందలి శమనకరఆవిరులను ఆస్వాదించండి.

పెప్స్
గొంతు మరియు
గుండె బిళ్లలు
మందుల వ్యాపారు
లందరి వద్దనూ
దొరకును
పి. ఇ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లి
FPY-56-TEL
సోల్ ఏజంట్లు: దాదా అండ్ కో.,
86, నైనియప్ప నాయక్ వీధి, మద్రాసు –3.